నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 5 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అమ్మవారి సన్నిధిలో పూజలు

ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఆదివాసులు

కెరమెరి, ఫిబ్రవరి 4: మండలంలోని మహరాజ్‌గూడ అటవీ ప్రాంతంలోని అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. జంగుబాయి దేవత దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ నెల 8న ఈ వేడుకలు ముగియనున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల భక్తులు అమ్మవారి దీవెన కోసం ఎంతో ఆసక్తి చూపుతున్నారు. యేటా పుష్యమాసంలో జంగుబాయి గుహలను దర్శించడం ఆదివాసీలకు ఆనవాయితీగా వస్తున్నది. అమ్మవారికి తీపి పిండివంటలు, రావుడ్కపేన్, పోచమ్మతల్లి, మైసమ్మ వద్ద మేకలు, కోళ్లను బలిచ్చి అక్కడే వంటలు వండి సహపంక్తి భోజనం చేసి తిరుగు ప్రయాణం చేస్తున్నారు.

చిరు వ్యాపారులను ప్రోత్సహిద్దాం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ టౌన్,ఫిబ్రవరి 4: చిరు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి ప్రోత్సహించడం ద్వారా ఆర్థికంగా చేయూతనిద్దామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోట్నాక భీమ్ రావు పిల్లల ఉద్యానవనంలో ప్రతి ఆదివారం పార్కును సందర్శించే వారికి అల్పాహారం, తినుబండారాల విక్రయ కేంద్రాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ,ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ప్రారంభించారు. ఆసిఫాబాద్ తహసీల్దార్ రమేశ్, మున్సిపల్ సిబ్బంది, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ సుమన్

రెండు నెలల్లోనే కాంగ్రెస్‌పై విముఖత

అదే మా మీద విముఖత రావడానికి తొమ్మిదిన్నరేండ్లు అయింది..

- ఇంద్రవెల్లిలో హంతకులే సంతాపం ప్రకటించడం అనైతికం
- దుష్ప్రచారం, అబద్ధపు హామీలతోనే అధికారంలోకి వచ్చిండ్రు..
- వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బాల్కసుమన్, వేదికపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎమ్మెల్సీ విఠల్

సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, మహిళలు

మంచిర్యాల, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని, ప్రజలు ఆరు నెలలకే రోడ్ల మీదకు వచ్చారని, ఇప్పుడు తెలంగాణలో రెండు నెలల్లోనే మేము ఏం అనకపోయినా ప్రజలే మేము ఇంత ఘోరంగా మోసపోతిమి.. ఇట్ల జేస్తరను కోలేదని కాంగ్రెస్‌ను ఛీత్కరిస్తున్నారని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉద్ఘాటించారు. దుష్ప్రచారాలతో మా మీద విముఖత వచ్చి మిమ్ములను ప్రతిపక్షంలో కూర్చొపెట్టడానికి తొమ్మిదన్నరేండ్లు పడితే, అదే కాంగ్రెస్‌పై రెండు నెలల్లో విముఖత వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ స్వగృహంలో ఆదివారం నిర్వహించిన చెన్నూర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంద్రవెల్లిలో మారణకాండ సాగించిన కాంగ్రెస్ పార్టీ అక్కడే సభ నిర్వహించడం అనైతికం, దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం.. అంటే ఏం తెస్తారు.. మళ్లీ ఇంద్రవెల్లి కాల్పులు తెస్తారా.. దేశంలో మరోసారి ఎమర్జెన్సీ తెస్తారా.. అదేనా మీరు తెచ్చే ఇందిరమ్మ రాజ్యం అని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ మా ప్రభుత్వాన్ని పడగొడుతారంటా.. వీళ్లు పడగొడుతారంటా.. వాళ్లు పడగొడుతారంటా అని భుజాలు ఎందుకు చరుచుకుంటున్నరో అర్థం కావడం లేదన్నారు. మా పని మాకు మస్తుగా ఉందన్నారు. మీ హామీలను గుర్తు చేసుకుంటా పోవుడే మా పని అని, మిమ్ములను బొంద పెట్టడానికి అవి సరిపోతాయని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీజేపీ ఒక ప్రణాళికతో చేసిన దుష్ప్రచారం, ఇచ్చిన అబద్ధపు హామీలతోనే అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడంపై దృష్టి సారించాలని హితువు పలికారు. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలయ్యేట్లు పని చేయాలని సూచించారు. ఆ పని పక్కన పెట్టి విపక్ష పార్టీలు, నాయకుల మీద కక్ష సాధించి వెళ్లిపోతామన్నట్లు ప్రజలు అంత అమాయకులు ఏం కాదన్నారు. ఆకలిగున్న ప్రజలకు రెండు, మూడు రోజుల వాయిదా నడుస్తదని, కడుపులో ఎండిన తరువాత వాళ్ల ఆగ్రహం ఎట్లా ఉంటదో మీరే చూస్తారన్నారు. మేం చేయాల్సిన పని మేము చేస్తే చాలు భవిష్యత్‌లో మీరు ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటారని, మీ ప్రభుత్వాన్ని పనిగట్టుకొని పడగొట్టాల్సిన అవసరం మాకు లేదని చురకలు అంటించారు.

రైతుబంధు నిధులు మంత్రి ఖాతాలోకి పోయినయ్.. : బాల్కసుమన్

రైతుబంధు కోసం కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.7,700 కోట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి కన్‌స్ట్రక్షన్ కంపెనీలోకి, కాంగ్రెస్ కాంట్రాక్టర్ల బేబుల్లోకి పోయాయని మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్ మండిపడ్డారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు, అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. డిసెంబర్ 9వ తేదీన చేస్తామన్న రైతు రుణమాఫీ, రూ.4 వేల పింఛన్, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి పంపిన 65 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సెక్రటేరియట్‌లో నిలిపివేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏనాడు ఇలాంటి చిల్లర పనులు చేయలేదన్నారు. చెన్నూర్ నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ నియోజకవర్గానికి నిధులు తెచ్చేందుకు కాకుండా ఆయన కొడుకు కోసం ఎంపీ టికెట్ తీసుకువచ్చేందుకే ఎక్కువగా తిరుగుతున్నాడని మండిపడ్డారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌కు ఇచ్చి, ఎంపీ సీటు వాళ్ల కొడుక్కు ఇస్తే అది కుటుంబ పాలన కాదా జనం ఆలోచించాలన్నారు. నియోజకవర్గంలో 45 వేల ఉద్యోగాలు ఇస్తామని, సింగరేణి కార్మికులకు పన్ను మినహాయింపు ఇస్తామని, క్వార్టర్లు ఖాళీ చేయిస్తామని ఇలా ఆయన ఇచ్చిన హామీలు అమలు చేస్తారో.. లేదో చూద్దామన్నారు. హామీలు అమలు చేస్తారని ఆశగా ఎదురు చూస్తుంటే వివేక్ పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభించుకుంటూ తిరుగుతున్నారని మండిపడ్డారు. ఎవరెన్నీ ఇబ్బందులు పెట్టినా తాను నియోజకవర్గం వదిలి పోయేది లేదన్నారు. తనపై అసత్య ప్రచారాలు చేశారని ఇప్పుడు అవన్నీ ఏమైపోయాయో జనం ఆలోచించాలన్నారు. వందల కోట్లు ఉన్న వారిని మళ్లీ ఓడించే దాకా చెన్నూర్ విడిచిపెట్టిపోయేది లేదని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా పోరాటం ఆపేది లేదన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా జనం ఇచ్చిన బాధ్యతను వంద శాతం నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు తాను, కేసీఆర్ తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. ఇన్‌చార్జి మంత్రి సీతక్క జై తెలంగాణ అనాల్సిన అవసరం లేదు. అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జై హింద్ అనేది ఇండియా ఎలానో జై తెలంగాణ అనేది తెలంగాణకు అంతే గొప్పదన్నారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటున్నది అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు ఆపే అధికారం ఎవరికీ లేదని, ఒకవేళ ఆపితే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. డీఎమ్ఎఫ్‌టీ నిధులు ఆపొద్దని కలెక్టర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమన్నారు. మాజీ మంత్రి బోడ జనార్దన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడడానికి అంతా కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద
- ఆసిఫాబాద్‌లో మెగా వైద్యశిబిరానికి హాజరు

జ్యోతిప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 4 : ప్రతి ఒక్కరికీ తమ ఆరోగ్యంపై అవగాహన అవసరమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నంద అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో దియా లిబాయి లాల్ చంద్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ దయానంద్ గౌరీ, సభ్యులు మీరా గౌరీ సౌజన్యంతో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్-హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో పాటు మెగా న్యాయ అవగాహన సదస్సును కూడా నిర్వహించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఉద్యోగుల కోసం వీటిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి జిల్లా న్యాయమూర్తి ఎంవీ రమేశ్, జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్ కుమార్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం క్యాన్సర్ ముప్పును ఎదుర్కొంటున్నదని, ప్రాథమిక స్థాయిలోనే నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స తీసుకొని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. కలెక్టర్ హేమంత్ మాట్లాడుతూ ఈ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని శాలువాతో సన్మానించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ జూనియర్ సివిల్ జడ్జి లు యువరాజ్, అజయ్, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, ఆసిఫాబాద్, సిర్పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్, న్యాయవాదులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 4: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ అధ్యయన కేంద్రంలో ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ విద్యార్థులకు ఆదివారం ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యయన కేంద్రం అధికారి టీ.ఎస్.ప్రవీణ్‌కుమార్ తరగతులను పరిశీలించారు. కౌన్సిలర్లను విద్యార్థులకు ఆయన పరిచయం చేశారు. మరో నాలుగు ఆదివారాలు తరగతులు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ డిగ్రీ పరీక్షల తేదీల మార్పు..

ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులకు ఈనెలలో జరగబోయే 3, 5 సెమిస్టర్ల పరీక్షల తేదీలు మారాయని అధ్యయన కేంద్రం గౌరవాధికారి టీ.ఎస్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 5వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 2 వరకు, 3వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 5 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకొని సెలవు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గమనించాలని కోరారు.

హట్టి ఆశ్రమ పాఠశాలలో అల్పాహారం కోసం చపాతీలు చేస్తున్న విద్యార్థులు

అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో నేలపై కూర్చొని అల్పాహారం తింటున్న విద్యార్థులు

చపాతీలు చేస్తూ.. కటిక నేలపై తింటూ..

ఆశ్రమాల్లో అల్పాహారానికి కష్టాలు

- హట్టిలో స్వయంగా చపాతీలు చేస్తున్న విద్యార్థులు
- అనార్‌పల్లిలో నీళ్ల చారులా ఆలుగడ్డ కూర
- అందుబాటులో లేని వార్డెన్, ఉపాధ్యాయులు
- ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ లోపం

నీళ్ల చారుని తలపిస్తున్న ఆలుగడ్డ కూర

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఆహార మెనూను అమలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కెరమెరి మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలలను ఆదివారం 'నమస్తే తెలంగాణ' సందర్శించగా హట్టి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు స్వయంగా చపాతీలు చేస్తూ కనిపించారు. అల్పాహారం మొదలుకొని రాత్రి డిన్నర్ వరకు వంటలో వంటలో చేయి వేయాల్సిందేనని విద్యార్థులు చెబుతున్నారు. సిబ్బంది లేకపోవడంతో మరికొందరు విద్యార్థులు గోళీలు ఆడుతూ కనిపించారు. ఇక అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారంగా పూరిని ఇచ్చారు. ఆలుగడ్డ కూర ఇచ్చినా నీళ్ల చారును తలపిస్తున్నది. ఇక విద్యార్థులు మట్టిలోనే కూర్చొని అల్పాహారాన్ని తింటూ కనిపించారు. ఆ సమయంలో విద్యార్థులను పర్యవేక్షించాల్సిన వార్డెన్, ఏ ఒక్క ఉపాధ్యాయుడు గాని కనిపించలేదు. అసలే పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు శ్రద్ధ పెట్టాల్సింది చదువులపైనే. కానీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పట్టించుకున్నవారే లేకుండా పోయారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితికి ఇది అద్దం పడుతున్నది. సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మూడు పంటల దిశగా ఆలోచించాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు
- జిల్లా కేంద్రంలో రైతు అవగాహన సదస్సు ఏర్పాటు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 4: నియోజకవర్గంలోని రైతులు మూడు పంటలు వేసే దిశగా ఆలోచించాలని, అందుకు అధికారులు సహకారం అందించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సూచించారు. స్థానిక పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో రైతు అవగాహన సదస్సుకు కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీరు అందుబాటులో ఉన్నందునా, రైతులు వరి, కూరగాయలు ఇతర లాభాల పంటలు వేసి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూరగాయలు మంచిర్యాలకు దిగుమతి అవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో కూరగాయలు పండిస్తే లాభసాటిగా ఉంటుందని తెలిపారు. అలాగే పాడి పరిశ్రమ వృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ తోపాటు వ్యవసాయ, బ్యాంకు, హార్టికల్చర్, ఉద్యానవన, కృషి విజ్ఞాన కేంద్రం, పశుసంవర్ధక అధికారులు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. బ్యాంకు అధికారులు రుణాల కోసం వచ్చే రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. సదస్సులో రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. ఈకార్యక్రమంలో లీడ్ బాంక్ రీజినల్ మేనేజర్ అపర్ణా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, బీజేపీ సీనియర్ నాయకుడు గొనె శ్యామ్ సుందర్ రావు, నాయకులు బొడ్డు శంకర్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశ పరీక్ష

బెల్లంపల్లి సీవోఈలో ప్రవేశ పరీక్షను పర్యవేక్షిస్తున్న ఆర్సీవో కే స్వరూపారాణి

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 4: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం సీవోఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన 14 పరీక్షా కేంద్రాల్లో 5918 మంది విద్యార్థులకు గానూ 5774 మంది హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లిలోని మూడు పరీక్షా కేంద్రాలను రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి పర్యవేక్షించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. 95 శాతం హాజరు నమోదైనట్లు ఆర్సీవో కే స్వరూపారాణి తెలిపారు. బెల్లంపల్లిలోని బాలుర,బాలికల, కాసిపేట పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, స్వరూప, ఊటూరి సంతోష్‌కుమార్ అన్ని ఏర్పాట్లు చేశారు. తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపార్ట్‌మెంట్ అధికారులుగా కాసారపు శ్రీధర్, బూర రమేశ్ బాబు,కుమ్మరి మోహన్, రూట్ ఆఫీసర్లుగా దశరథం, ఆనందరెడ్డి వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నస్పూర్, ఫిబ్రవరి 4: దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న కల్యాణ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్ ఆదివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 21న జరిగే కళ్యాణ మహోత్సవానికి సతీసమేతంగా హాజరవ్వాలని ఆహ్వానించారు. ఆయన వెంట ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా తహసీల్దార్ల కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, ఫిబ్రవరి 4 : తెలంగాణ తహసీల్దార్ల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరేటి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్తేర్ వర్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా భోజన్న(కాసిపేట), శ్యాంసుందర్(జైనథ్), ఉపాధ్యక్షులుగా సుభాష్ చందర్, సంపత్ శ్రీనివాస్, నలంద ప్రియ, కోశాధికారిగా ఇమ్రాన్‌ఖాన్(నెన్నెల), ప్రచార కార్యదర్శిగా దిలీప్ కుమార్, కార్యదర్శులుగా తుకారాం, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మీ, వేణుగోపాల్ తదితరులను ఎన్నుకున్నారు.